ఆంధ్రవాహిని (అట్టావా) నిర్వహించిన
1988 శ్రీరామ నవమి కథల పోటీలో
సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ.



# అంతరాలు

ఉపద్రష్ట కృష్ణప్రియ

సిగ్గుల మొగ్గలాగా గదిలోకి వచ్చింది సీత కాఫీ పట్టుకుని. శ్రీరామ్ తలెత్తాడు. వాళ్ళకి పెళ్ళయి వారం రోజులైంది. ఇంకా ఇద్దరికీ కొత్త తీరలేదు.

కాఫీ అందుకుని "కూర్చో" అన్నాడు మంచం మీద కొంచెం ప్రక్కకి జరిగి జాగా చూపించి.

మెల్లిగా కూర్చుంది సీత.

అడుగుదునా, మానుదునా అన్నట్లు ఆమె ఘడియ ఘడియకీ తలెత్తి వాల్చుకోవడం, గబగబా చీర చెంగు కోసి మెలిపెట్టడం బట్టి ఏదో అడగడానికి ఆమె సంశయిస్తోంది అని గ్రహించాడు శ్రీరామ్.

"ఏమిటి విశేషాలు ?"అన్నాడు తాపీగా.

"హైదరాబాదులో ఉద్యోగావకాశాలు ఎక్కువట కదా!" అంది.

"ఊ... ఏం చెయ్యాలని వుందా?"

గబ గబా తలవూపింది సీత.

ఒక్క క్షణం మౌనంగా ఊరుకున్నాడు శ్రీరామ్.

"అక్కడికి వెళ్ళేక మాసుకుందాం. ఇక జీవిత కాలమంతా అక్కడే కదా. హనీమూన్ సంగతి మాత్రం నువ్వు తేల్చలేదు."

ఆప్యాయంగా ఆమె చుట్టూ చేయి వేసి అన్నాడు శ్రీరామ్.

"మీ యిష్టం"-మత్తుగా వచ్చింది జవాబు.

"ఊటీకి బుక్ చేయించమని అన్నయ్యకి వ్రాశాను. ఈలోపు మా ఫ్రెండ్సు ఇళ్ళలో మజిలీలు చేసుకుంటూ హైదరాబాదు వెడదాము. వీళ్ళు అనివార్య కారణాల వల్ల పెళ్ళికి రాలేకపోయామని వ్రాశారు. ఏమంటావు?"

"అలాగే"

"అయితే బట్టలు సర్దెయ్యి!"

గబగబా లేచింది సీత.

* * * *

గడ్డం గీసుకుంటున్న సుందరం అద్దంలో తన వెనుక

నిలబడ్డ శ్రీరావ్ దంపతుల్నిచూసి తబ్బిబ్బయ్యాడు. గబ గబా రేజర్ కిందపెట్టి "హల్లో శ్రీరావ్" అంటూ కౌగలించుకున్నాడు.

"రామ్మా కూర్చో" అంటూ సీతని ఆహ్వానించాడు.


మొహమాటంగా కుర్చీలో కూర్చుంది సీత.

"మీ మారేజికి రాలేకపోయాంరా. సారీ. ఉరమని పిడుగులాగ నువ్వు..!అదే ఇలా రావడం చాలా సంతోషంగా ఉందిరా." కలగాపులగంగా మాట్లాడేయసాగాడు.

"అరుణ లేరా"! శ్రీరావ్ అడిగాడు.

"లేదురా. సాయంత్రం ఆరుదాకా దేవి గారి దర్శనం అవదు. పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోయింది. ఊరికి దూరం కదా మా క్వార్టర్సు. అవసరాలన్నీ ఊళ్ళోనే. తన ఉద్యోగం ఊళ్ళో. పిల్లల స్కూళ్ళు ఊళ్ళో. ఎనిమిదికల్లా ఇల్లు ఖాళీ. నాకు వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయింది ఈ మధ్య. ఇవాళ లేటైపోయింది.లేకపోతే పలాస పాసింజరులో నా ప్రయాణం. ఇవాళ బస్‌లో వెడతాననుకో. అది సరేగానీ... ఏమ్మా కాఫీయా, టీయా?" సగం గీసిన గడ్డాన్ని అలాగే ఉంచి, లుంగీ ఎగగట్టి అడిగాడు సుందరం.

"టీ పొడీ, పాలు ఎక్కడో చెప్పండి.నేను పెడతాను." అంటూ అతడు వద్దంటున్నా యింట్లోకి దారబడింది సీత.




భోజనాల ప్రయత్నం వద్దన్నాడు శ్రీరావ్. మార్నింగు షోకి వెళ్ళి ఏదైనా హోటల్‌కి వెడదామన్నాడు. సుందరం పైకి బాధపడ్డా ఒప్పుకున్నాడు. అతను భోజనం కానిచ్చి వెళ్ళిపోయాడు.

* * * *

సాయంత్రం దాకా అక్కడా, యిక్కడా గడిపి యిల్లు చేరారు శ్రీరావ్ దంపతులు. అరుణ సాదరంగా ఆహ్వానించింది యిద్దరినీ.

"రాత్రికి సింపుల్‌గా వుంటుందని, వేపుడూచారూ చేశాను. చాలవూ" అంది అరుణ.

"చాలండీ" అంది సీత మొహమాటంగా.

పిల్లలకి ముందు భోజనం పెట్టి పడుకో పెట్టేసింది అరుణ.

జంటలిద్దరూ కూర్చున్నారు భోజనాలకి.

అందరి కంచాల్లోను రెండు పుంజీల ముక్కలు వేసింది అరుణ. ఓ ఎండు ఆవకాయ డిప్ప వడ్డించింది. మిగిలిపోయిన ఓ పుంజీడు ముక్కలు మధ్యలో పెట్టింది.

"అయ్యో అప్పడాలు, వడియాలు ఉన్నాయి. మరిచేపోయా. కానీండి. పెళ్ళి భోజనాలతో మీకు మొహం మొత్తి ఉండవచ్చు. మాకివి చాలు. ఏమంటారు?" నవ్వుతూ అంది అరుణ సీతతో.

"సరేనండీ" మొహమాటంగా అంది సీత.

అవీ యివీచెప్పుకుంటూ కబుర్లలో పడ్డారంతా.

సీతకి రెండు ముద్దల్లో వేసిన ఐటమ్స్ అయిపోయాయి.

అడుగుదామంటే మొహమాటం. నవ్వుతూ ఏవీ పట్టించుకోకుండా సుందరం, శ్రీరావ్‌తో కబుర్లు చెప్తోంది అరుణ.

చారుగిన్నె చాలా చిన్నది. ఉసూరుమనిపించింది


మీ శ్రీమతిని మెప్పించాలనుకుంటున్నారా?

అప్పుడు...



మా ఆవిడ దీనినే కోరుకుంది

ఇప్పుడు...




మా ఆవిడ దీనినే కోరుకుంది

అవును మరి! మా ఆవిడ మన్నికైన
నాణ్యమైన వస్తువులను మాత్రమే కోరుకొంటుంది.

వినీల
స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ ఫిల్టర్
మంచినీరు 100% సురక్షితం!

కాంచన్
కిచెన్ క్వీన్
3 స్పీడ్ మిక్సర్ & గ్రైండర్

మార్కెట్ చేయువారు:
విజయ ఎంటర్‌ప్రైజెస్
హోటల్ అనుపమ కాంప్లెక్స్,
గవర్నరుపేట, విజయవాడ-2
ఫోన్: 64718



పెండ్లికి ముందు, పెండ్లి తరువాత



అన్నిరకములైన వ్యాధులను ఇంకా నపుంసకత్వాన్ని, హస్త ప్రయోగమువలన నరాల బలహీనతకు, స్వప్న మందు వీర్యస్కలనము వలన బలహీనతకు (V.D) గనేరియా, సిఫిలిస్, ఇంకా సంతానములేనివారు సంతానమును కలిగించుకొండి. ఈ వ్యాధులకు సుమారు ఎన్నో సంవత్సరములు అనుభవముగల డాక్టరు ఎం.హెచ్.మల్లిక్ (Govt. Regd) గారితో చికిత్స పొందవలెను. వీరి చికిత్సనుంచి వేలాది ప్రజలు రోగముల నుంచి సుఖపడినారు.

సూచనము: మీరు ఏ రోగము వున్నా పర స్థలమునుంచైనా పోస్టుద్వారా పత్రము వ్యవహరించుకొని మందులు పోస్టు పార్సిల్ ద్వారా తెప్పించుకొని ఉపయోగించుకొనవచ్చును. మీరు మీ దాంపత్య సుఖమును పొందండి.

సంప్రతించు వేళలు: ఉదయం 9 గం.నుంచి సాయంత్రం 8 గం. వరకు.
ఆదివారం కూడా పనిచేయును.

మల్లిక్ డిస్పెన్సరి
34/2, శ్రీ హరిరాం కాంప్లెక్స్, సాగర థియేటర్ ప్రక్కన
కెంపేగౌడ రోడ్డు బెంగుళూరు- 560 009

సీతకి. ఓ గరిటెడు చారు పోసుకుంది.

"అరె అప్పుడేనా చారు. ఈ ముక్కలు వేసుకోండి." మిగిలిన కూర పళ్ళెం ఎత్తి అంది అరుణ.

"వద్దండీ" అంది సీత సిగ్గుగా.

"నే చెప్పలా ఈ కాలం తిళ్ళ సంగతి; దెయ్యాల్లా తినడం మానేశారు. రెండు అరటికాయల వేపుడు ఇంతమంది తినగా మిగిలిపోయింది. ఏమిటో! పోన్లెండి. ఫ్రిజ్‌లో పడేసి రేపు పిల్లలకి వేసి పెడతా."

అందరికీ తలోగరిట మజ్జిగ వడ్డిస్తూ అంది అరుణ.

అరుణ వెనక అన్నీ సర్ది, శ్రీరామ్ దగ్గరకి వచ్చేటప్పటికి పదయ్యింది సీతకి. పొట్టలో సంతృప్తి కనపడలా.

"సీతా! బాస్కెట్లో రెండు యాపిల్సు ఉన్నట్లున్నాయి కోసిపెడుదూ." అన్నాడు శ్రీరామ్ పెన్ నైఫ్ తీసి యిస్తూ.

ఆమెకి అరుణ బిహేవియర్ చిత్రంగా అనిపించింది.

అక్కడున్న రెండు రోజులూ సీతకి ముళ్ళమీద ఉన్నట్లే అనిపించింది. మూడో రోజు ప్రయాణం.

ముఖం కడుక్కుందుకి బాత్‌రూమ్‌వైపు నడవబోయిన సీత ఆగిపోయింది పక్కగదిలో భార్యభర్తల ఘర్షణకి.

"ఇదిగో! ఇది నా హుండీ పిడత. దీంట్లో డబ్బు తాకేందుకు మీకేం అర్హత లేదు. మీ ఫ్రెండ్సు మీ యిష్టం. ఎక్కడ అప్పచేసుకుంటారో నాకుతెలియదు." అరుణ గొంతు.

ముఖం కడుక్కునే ప్రయత్నం మాని పొదరురాసుకుని తయారైపోయింది సీత.

ఒక యిరవై రూపాయల నోటు తాంబూలంలో పెట్టి యిచ్చింది అరుణ సీతకి ముఖాన బొట్టుపెట్టి

"మా యింటికి ఎవరు వచ్చినా యింతేనమ్మా. అన్నీ పద్ధతి ప్రకారం జరుపుతాం" అంటూ.

డబ్బు వద్దని ఎంతగా సీత చెప్పినా అరుణ వినలేదు.

వెళ్ళివస్తామని యిద్దరూ బయలుదేరారు.

కొంచెం వూపిరి ఆడినట్లైంది సీతకి.

* * * *


"రా శ్రీరామ్" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు రమణమూర్తి శ్రీరామ్ దంపతుల్ని.

"రండి" సుజాత సీతని అభిమానంగా పిలిచింది.

"మీ ఆఫీసు దగ్గరా. అప్పుడే వచ్చేసారు" అంది సీత.

"అబ్బే. మా అత్తగార్కి జ్వరం. మీరు వస్తున్నారు. రెండూ కలిసివచ్చాయి కదాని యిద్దరం సెలవుపెట్టాం" అంటూ సీతని లోపలికి తీసుకుని వెళ్ళింది.

"అసలు మా సమలలో మాకే తెమలక




పోతుంటే, పంతుల ప్రకారం ఏడాదికి మూణ్ణెల్లు తిష్టవేస్తారు చెల్లెమ్మా మా అత్తామామలు. మా వారు అపర శ్రీరామచంద్రులు. ఇంట్లో, బయటా ఈ చాకిరీ పస్తున్నానమకో"- విసుగును వంట చేస్తున్న గిన్నెల మీద చూపిస్తూ అంది సుజాత.

పెట్టుడు విషయాల్లో అరుణ కన్నా, సుజాత నయమనిపించినా, ముఖం ముటముటలాడుతూ భయాన్ని కలిగించింది సీతకి. సుజాత అత్తగారు కూడా ఒదిగి ఒదిగి ఉండేవారు. సీతకి విచిత్రంగా అనిపించింది.

"ఎవరూ లేరుతల్లీ, ఈ తల్లిలాగ. అయినా యిదంతా మా ఖర్మ. ఉన్నయిల్లు, నగలు అమ్మి పిల్లల్ని పెంచి పెద్దచేశాము. చక్రవర్తుల్లాగా నలుగురు కొడుకులని మురిశాము గానీ, నిలువనీడ లేకుండా ఇలా దేశ ద్రిమ్మరుల్లాగా తిరగాల్సి వస్తుందనుకోలేదు" కోడలు లేని సమయం చూసి బాధ వెళ్ళబోసుకున్నారు ఆమె అత్తగారు రహస్యంగా.

అత్తమామలకి విడివిడి కంచాలు, గ్లాసులు, గది బయటికి కదిలి రాకూడదనే ఆంక్షలు, పనిచేస్తే బాధ, చెయ్యకపోతే బాధ.

సుజాత విచిత్రప్రవృత్తి సీత మనసుని కలచివేసింది.

రెండ్రోజులు కాగానే హైదరాబాదు బయల్దేరారు శ్రీరామ్ దంపతులు. బయల్దేరుతూంటే ఓ పోలియెస్టరు జాకెట్టు గుడ్డ పసుపూ, కుంకుమ ఇచ్చేసింది సుజాత - సీత వద్దని వారించినా వినకుండా.

* * * *

"రావోయ్ శ్రీరామ్. రారా" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు సుబ్బారావు.

సీతని ఆప్యాయంగా కౌగలించుకుని "మా శ్రీరామ్ సెలెక్షన్, ఏమో అనుకున్నాను ఫెంటాస్టిక్." అంది పార్వతి. సీత చాలా సిగ్గు పడింది.

"వదినా...నా డిసెక్షన్ బాక్స్ కనబడ్డంలేదు" అను పమ్.

"మమ్మీ... నాషర్ట్ కనబడడంలేదు. స్కూల్ టైమ్ అయిపోతోంది." విజ్జూ.

"వస్తున్నానయ్యా" అంటూ "మీరు ఈ గదిలో కొంచెం సేపు రెస్టు తీసుకోండి" అంటూ. లోపలికి వెళ్ళిపోయింది పార్వతి.

"వదినా! అమ్మా! పార్వతీ!, అమ్మా పార్వతీ!" అన్న పిలుపులు అలా వినిపిస్తూనే వున్నాయి.

మధ్యలో కాఫీ, ఫలహారాలతో వచ్చి దంపతులకి యిచ్చివెళ్ళింది పార్వతి.

పది గంటల దాకా అలా అష్టావధానం చేస్తున్న ఆమెని చూస్తూంటే జాలి అనిపించింది సీతకి. శ్రీరామ్ మాత్రం ఏదో పత్రిక తిరగేస్తున్నాడు.

పదవుతుంటే చీర సర్దుకుంటూ వచ్చింది పార్వతి.

"శ్రీరామ్! ప్లీజ్... ఏమీ అనుకోవద్దు. ఇవాళ స్కూల్లో ఇన్‌స్పెక్షన్ వుంది. సెలవు పెట్టడం కుదరదు. మీరు భోజనం చేసి రెస్టు తీసుకోండి" అంటూ వెళ్ళిపోయింది పార్వతి.

భోజనం వడ్డిస్తున్న సుభద్రమ్మ "ఒక్కపూట సెలవు పెట్టడమంటే ఏడుపు ఇల్లాలికి. తెచ్చిన కట్నాలు ఏమీ లేవు సరికదా, దాని జీతం రాళ్ళు దానికీ, దాని పిల్లలకీ బట్టలకి కూడా రావు. పెద్ద పతివ్రతలగా మాట్లాడుతుంది. ఇవాళ పప్పు నానబెట్టలేదు రేపటి కోసం. అన్నీ మతిమరుపే. రానీ. సాయంత్రం వచ్చి బాధపడితే గానీ ఈమరుపు జాడ్యం వదలదు" అని

మేఘన, రోజులన్నీ మావే ఫేమ్ యువ రచయిత మరో అద్భుత సృష్టి

పుట్టగుంట గోపీచంద్
నవల

గుప్పెట తెరవకు

త్వరలో
ప్రారంభం

అంటూంటే మనసు కలుక్కుమంది సీతకి. మధ్యాహ్నం చింతగింజలాడుకున్నారు పార్వతి అత్తగారూ, ఆడబిడ్డా కాలక్షేపం కోసం.

సాయంత్రం వచ్చీరాగానే బియ్యం చేట అందుకుంది పార్వతి ఏరడానికి. పిల్లలకి బట్టలు మార్పించింది. ఈ లోపు కొళాయి హడావిడి. మధ్య మధ్యలో సీతని పలకరిస్తూ వంట పూర్తి చేసేసింది పార్వతి. వంట అయ్యేటప్పటికి మళ్ళీ, "అమ్మా, వదినా! పార్వతీ! పార్వతమ్మ తల్లీ!"లాంటి పిలుపులు. అలాగ గిలకలాగా తిరుగుతూ క్షణం విశ్రాంతెరుగని పార్వతిని చూస్తే బాధ కలిగింది సీతకి. రెండ్రోజులు కాగానే బయలుదేరారు దంపతులు. చీర జాకెట్టు పెట్టింది పార్వతి. హైదరాబాద్ రైల్లో పడ్డారు దంపతులు.

* * * *

రైలులో ప్రక్కన కూర్చున్నా పరధ్యానంగా ఎక్కడో వున్న సీతని మోచేత్తో పొడిచాడు శ్రీరావ్ "ఏమిటి ఆలోచన" అంటూ. సిగ్గుగా నవ్వింది సీత.

"ఏమిటో పార్వతి ఉద్యోగంలో చాలా అవస్థ పడుతున్నారనిపిస్తోంది."

"బాగుంది. ఆమెకి అవసరం. మావాడి జీతం మామూలే. పెద్ద ఫామిలీ. తప్పదు!"

"ఏమో గానీ మనుషుల జీవితాలు చాల డ్రైగా కనిపిస్తున్నాయి నాకు. అరుణలో హిపోక్రసీ, సుజాతలో సెల్ఫిష్‌నెస్. అబ్బబ్బ!! ఆదరణ, ఆప్యాయతలు ఆమడ దూరంలో ఉన్నట్లుగ్గా అనిపిస్తున్నాయి. మీ ఫ్రెండ్సుని అలా అంటున్నానని అనుకోకండి" అంది బాధగా.

"మనుష్యుల జీవితాలు మారుతున్న ఆర్థిక వ్యవస్థలో ఇరుకుగా మారిపోయాయి. దాంతో హృదయాలు కూడా ఇరుగ్గా మార్చేసుకున్నారు. అవసరాలు తీరడం కోసం ఆదా చెయ్యడం మొదలై, ఆ అవసరాలు తీరినా డబ్బు మిగులుతుందని, ఆ దారి వదలక జీవితాలని నిస్సారం చేసుకుంటున్నారు కొందరు. హడావిడి జీవితాల వలన యాంత్రికత జీవితాలలో తిష్ట వేసుకుంటుంది. జీవితాలు నిస్సారంగా మారిపోతున్నాయి. మెటీరియలిస్టిక్ వేల్యూస్ కిచ్చిన ప్రాధాన్యం హ్యూమన్ వేల్యూస్‌కి యివ్వలేకపోతున్నారు. అది సరేలే గానీ...

...సీతా నీ కో సంగతి చెప్పనా. నిన్ను మా ఫ్రెండ్ పెళ్ళిలో చూశాను. నువ్వే నా శ్రీమతివి కావాలని ఎందుకనుకున్నానో తెలుసా! నీలో నేనాశించిన నెమ్మదితనం, అణకువ, ప్రేమ అన్నీ ఉన్నాయి. మీ ఫ్రెండు బామ్మగార్ని నువ్వాదరించిన తీరు నాకెంతో సంతోషాన్నిచ్చింది.

"వాడి మంచి పోస్టే. దగ్గర దగ్గర నాలుగు వేలు దాకా వస్తుంది. భార్యా బిడ్డల్ని సమర్థవంతంగా పోషించగల స్తోమత వుంది. ఇంట్లో అన్ని ఫెసిలిటీస్ అరేంజి చేశాను.

సుజాత అత్తమామల లాగా అన్నయ్యల దగ్గర అమ్మానాన్న యిబ్బంది పడుతున్నారు. వాళ్ళు మన మధ్య హేపీగా వుండాలి.

సీతా! నీ ఉద్యోగం సంగతి నీ యిష్టం. ఆలోచించుకో. హైదరాబాదు లైఫ్ బాగానే వుంటుంది. చూస్తావు కదా!!"

నవ్వుతూ తేల్చేశాడు శ్రీరావ్. యేం మాట్లాడాలో తెలియని పరిస్థితిలో మౌనంగా ఉండిపోయింది సీత. ఆమె మనసు నిండా శ్రీరాముడే!

●




యాంటీ స్మోకింగ్ శిక్షణ శిబిరంలో ఇటీవల విజయవాడ రోటరీ మిడ్ టౌన్‌వారి నిర్వహణలో ధూమపానం వల్ల నష్టాల గురించి ప్రసంగిస్తున్న డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి. వ్యాస రచయిత టి.ఎస్. రావ్, డాక్టర్ జి. సమరం, శ్రీ జయరాంప్రసాద్, శ్రీ ఎల్.డి. ప్రసాద్ వేదికపై వున్నారు.

# ధూమపానం! దూరం దూరం!!

పొగ త్రాగడం వలన కలిగే హాని గురించి శాస్త్రజ్ఞులు విస్తృతంగా పరిశోధిస్తున్నారు. ఈ సమస్య ఎంత తీవ్ర రూపం దాల్చిందంటే- 1980వ సంవత్సరంలోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన "పొగ త్రాగడమా? మంచి ఆరోగ్యమా?" అన్న నినాదం సమస్య తీవ్రతను ప్రతిధ్వనిస్తోంది.

విభిన్న దేశాల ప్రభుత్వాలు సైతం ఈ విషయంలో ఎంతో ఆందోళన చెందుతున్నాయి. అందుకే ప్రతి సిగరెట్ పెట్టె మీద "స్మోకింగ్ ఈజ్ ఇంజూరియస్ టు హెల్త్" అని తప్పనిసరిగా ప్రకటించాలని ప్రభుత్వం ఆదేశించింది. కొన్ని దేశాలలో ధూమపానానికి సంబంధించిన ప్రకటనలు రేడియోలలో, టీవీ, పత్రికలలో నిషేధించారు.

పొగ తాగడం ప్రమాదకరమని వ్రాసి వున్నప్పటికీ అది చదివి కూడా తాగుతూనే వుంటారు. ఇది అనవసరపు ఖర్చే గాని ఏమాత్రం మేలు చేసేది కాదని, పైగా మెదడు, గుండె, ఊపిరితిత్తులు మొదలైన భాగాలకు తీవ్రంగా కీడు జరుగుతుందని చాలామందికి తెలుసు. అయినా ఈ వ్యసనాన్ని వదులుకోలేరు.

ఆయితే చాలామంది ఈ దురలవాటుకు స్వస్తి చెప్పాలనే భావిస్తుంటారు. కాని విజయం సాధించలేక పోతుంటారు. దీనికి కారణం మానాలనే కోర్కె వారి అంతఃచేతనలో బలీయంగా లేకపోవడమే!

'సిగరెట్ తాగడం నా స్వంత విషయం, నా యిష్టం' అనేవారు ధూమపానం వల్ల తమ చుట్టూ వున్నవాళ్ళకు ఏమీ ఇబ్బందిని కల్గించనంతవరకు ఫరవాలేదు. కాని పరిసరాలు కలుషితమై పీల్చే గాలిలో స్వచ్ఛత హరించుకుపోయేటప్పుడు మిగతావారు దీనికి తప్పక అభ్యంతరాన్ని తెలియజేస్తారు. పౌరులుగా పొగ తాగడానికి మీకు ఎంత హక్కు వుందో, తమకు అది నష్టం కలిగిస్తున్నప్పుడు వాతావరణ కాలుష్యం కూడదని వారించడానికి ఇతరులకు అంతే హక్కు వుంది.

ప్రభుత్వాలు శాసనాల ద్వారా శాసించవచ్చునేమో గాని ఈ వ్యాపారాన్ని పూర్తిగా ఎత్తివేయడం చాలా కష్టమైన పని. లక్షలాది కుటుంబాలు పొగాకు పండించడంలోను, అనుబంధ పరిశ్రమలలోను పనిచేస్తున్నాయి.

అందువల్ల ఈ సమస్యకు ఒక్కటే పరిష్కారం- ప్రజలలో విస్తృతంగా దీని దుష్ప్రభావాన్ని గురించి ప్రచారం చేయాలి. స్వచ్ఛంద సేవాసంస్థలు, ఆరోగ్య సంస్థలు హెల్త్ వార్నింగ్ అనునిత్యం ప్రజల దృష్టి సోకేలా ప్రచారం చేస్తుండాలి. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ విషయంపై ఇంకా బాగా ఆలోచించాలి. స్మోకింగ్ వ్యతిరేక ప్రచార ఉద్యమాన్ని నిర్వహించాలి. ప్రజల్ని చైతన్యవంతులుగా చేయాలి.

జర్నలిస్టులు ఈ సమస్యను తీసుకుని వ్యాసావళి ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకురావాలి. ప్రచార సాధనాలు అన్నింటిని ఇందుకోసం ఉపయోగించుకోవాలి. స్మోకింగ్ అందరకూ సంబంధించిన సమస్యగా మనం గుర్తించాలి.

—టి.ఎస్. రావ్